
సుబ్బారావ్ డిగ్రీ ఆఖరి సంవత్సరంలోకి వచ్చినా, చిన్నప్పటి నుంచీ అదే ఊరిలో ఉంటున్నా, ఈనాటికీ అతనికి ఒక్క స్నేహితుడన్నవాడు లేడు. స్నేహం ఎలా ఉంటుందో, ఒకరితో ఒకరు జట్లు ఎలా కడతారో అంతు చిక్కని ప్రశ్నల అతనికి.

తను పుట్టకముందే శని పుట్టేసి ఎక్కడికి వెళ్లినా అది ముందుండి తన బ్రతుకుని ఏషా



# మానసిక సమస్య

దం చేసేస్తోందని అనుకుం టాడు సుబ్బారావ్.

'దెయ్యంమొఖం వాటికి చూ- వాళ్లను చూస్తే భయం. ఇక వాళ్లను చూస్తే సిగ్గు [illegible] అక్షరాలా ఆశీర్వచనమై సుబ్బారావ్ జీవితాన్ని వాటికి తాకట్టుగా తయారుచేసింది.

సిగ్గు, బిడియం అతని బ్రతుకులో ఇష్ట లేనివి. అతన్ని ఎవరితోనూ కలవనీకుండా, ఎవరూ అతనితో కలవకుండా చేశాయి. స్కూ-ల్లో వెనుకబడి ఒక్కో తరగతి రెండేసార్లు చదువుతూ పాతికేళ్లకి డిగ్రీ ఆఖరి సంవత్సరం లోకి వచ్చాడు. ఎలాగోలా ఈ డిగ్రీ పూర్తిచేస్తే ఏదో ఒక పని చూసుకొని, తన ఒంటరి బ్రతు కుని తను ఈడ్చవచ్చు అనుకుంటూ వుంటాడు.

ఒకరోజు సుబ్బారావ్ కాలేజీ నుంచి వస్తూం టే దారిలో ఒక గోడమీద చక్కగా, పెద్దగా రాసిన రాతలు అతని ఒంటరి జీవితంలో పెను అల జడి రేపాయి.

'మానసిక సమస్యలా? సిగ్గూ, బిడియంతో నలుగురిలో కలవలేకపోతున్నారా? మీరూ అందరితో కలిసి మెలిసి ఉండాలనుకుంటు న్నారా? అయితే రండి...' అన్న అక్షరాలు అమృ తపు చినుకుల్లా అతని హృదయం మీద పడ్డా యి. అసలు ఇటువంటి సమస్య తన ఒక్కడికే వుందని, ప్రపంచంలో తనొక్కడూ వేరే అను కున్న సుబ్బారావుకి ఆ సమస్య కళ్ల ఎదురుగా పెద్ద పెద్ద అక్షరాలతో సాక్షాత్కరించడం, ఆ సమస్యను తొలగించి మామూలుగా చేస్తామనే ఆహ్వానం ఉక్కిరిబిక్కిరి చేసాయి.

జీవితంలో ఈ సిగ్గూ, బిడియం తనను వదిలిపెట్టవని, తన బ్రతుకింతేనని సుబ్బారావ్ అనుకునేవాడు. అటువంటిది ఏకంగా వాటిని వదిలించి, మామూలుగా అందరిలా వుండేట ట్టు చేయడం అద్భుతంగా అనిపించింది.

తనదీ ఒక బ్రతుకేనా? మనిషైపుట్టి సాటి మనిషిని చూసి భయపడుతూ ప్రక్కలకి తొలగి పోవడం - జంతువులూ, పక్షులూ సైతం స్నేహంతో ప్రేమతో జీవితాన్ని ఆనందిస్తూంటే అదేమీ లేకుండా. ఎడారి జీవితం ఈడ్చడం... ఈ రోజు ఆ సమస్యకు పరిష్కారం దొరికింది. ఆలోచిస్తుంటే సుబ్బారావ్‌కి ఒళ్లంతా రోమా లు నిక్కపొడుచుకుంటున్నాయి. ఆనందంతో హృదయం పురివిప్పి నాట్యం చేస్తోంది.

గబగబా ఇంటికి వచ్చాడు. ఆ ప్రకటన చూసిన హడావిడిలో సరాసరి ఇంట్లోకి వెళ్లబో యాడు. ఇంతలో తల్లి అనసూయ "ఒరేయ్ చవటా కాళ్లు కడుక్కొని లోపలికి చావ్" అంటూ అరిచింది. మళ్లీ వెనక్కి వచ్చి నూతి దగ్గరకు పోయి కాళ్లు కడుక్కొని లోపలికి వచ్చాడు. కుర్చీలో కూర్చుని ఆలోచనల్లో పడ్డాడు. ఈ

**ఎ. ఉదయభాస్కరరావు**

రోజే వెళ్లి కనుక్కోవాలి. వాయిదా ఎందుకు? అనుకుని మరలా లేచి బయలు దేరాడు.

"ఎక్కడికి పోతున్నావురా? రాత్రికి కూర లేం లేవు. ఏవన్నా తెస్తేనే కూర".

అమ్మ ఇచ్చిన డబ్బులు, సంచి తీసుకుని బయటకు నడిచాడు. ఆ ప్రకటనలోని అడ్రసు ప్రకారం ఓ ఇంటి ముందు ఆగాడు. అదే ఇల్లు... గోడమీది ప్రకటన బోర్డు రూపంలో ఇంటిముందు గోడకు వేళ్లాడుతోంది. లోపలికి వెళ్లడానికి భయం, ఆందోళన. క్రొత్త మనుష లన్నా, క్రొత్త ప్రదేశమన్నా గుండెల్లో ఒకటే దడ. కాళ్లు ముందుకు పడటంలేదు. ఈ భయం, ఆందోళన ఎందుకో ఎంత బుర్రబద్దలు కొట్టు కున్నా సుబ్బరావ్‌కు తెలియడంలేదు.

ఎందుకురా భయం? కొడతారా. తిడ తారా, చంపుతారా? అంటూ మనస్సు ప్రశ్ని స్తోంది. అయినా కాళ్లల్లో చలనం లేదు. ఎవ రుంటారో, ఏమంటారో, తన సమస్య విని నవ్వు తారేమో! ఇంతకాలం ఎలా బ్రతికావయ్యా? అంటూ గేలి చేస్తారేమో! అనవసరంగా ఇదొక కొత్త బాధను తెచ్చుకుంటున్నానేమో! అంటూ మనసు రకరకాలుగా ఆలోచనలు చేసింది.

చివరికి నెమ్మదిగా లోపలికి అడుగు పెట్టా డు. ఎదురుగా ఒకతను సుబ్బారావుని చూసి దగ్గరకు వచ్చాడు. "ఏం కావాలి?"

"అదే... బయట బోర్డు వుంది....

"రండి... ఇలా కూర్చోండి" అతను మరో కుర్చీలో కూర్చున్నాడు.



సుందరయ్య విజ్ఞానకేంద్రం, హైదరాబాద్‌లో జీవన్ కథలు 'చేదుఫలం' పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రఖ్యాత కథా రచయిత్రి శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డి. చిత్రంలో ఎడమ నుంచి శ్రీపతి. నిఖిలేశ్వర్, శీలా వీర్రాజు, జీవన్, కాలువ మల్లయ్య, సుజాతారెడ్డి. రావూరి భరద్వాజ ఫొటో: తుమ్మల రామకృష్ణ.

"చెప్పండి"

"నాకు సిగ్గండి... బాగా ఎక్కువండి... నలుగురిలో మాట్లాడలేను. ఎప్పుడూ ఒంటరిగా ఉండాలనిపిస్తుంది..."

"ఓ... షై?... ఎవరితోనూ సరిగా మాట్లాడలేరు, ఎవరితోనూ సరైన కాంటాక్టు పెట్టుకోలేరు".

"అవునండీ... చాలా చిన్నప్పటి నుండి... నేను పుట్టినప్పటి నుండీ కొత్త వాళ్లంటే భయం... ఎవరితోనూ సరిగా మాట్లాడలేను. భయం..."

"మిమ్మల్ని మార్చెయ్యొచ్చు. అందరిలా మీరూ నలుగురిలో కలిసి పోవచ్చు".

"నిజంగానా?"

"అవును. మా దగ్గర ట్రైనింగ్ తీస్కొన్న చాలామంది మారి, మామూలుగా ఉంటున్నారు"

"నేనూ వస్తానండి..."

"రండి... మీరు నెలరోజులు ట్రైనింగ్ తీస్కుంటారా?

"అవసరం అయితే తీస్కుంటాను. ఫీజు ఎంతండి?

"నెల రోజులకు పదివేలు. పదిహేను రోజులకు ఐదువేలు. వారం రోజులకు రెండువేల ఐదువందలు... ఈ మూడింటిలో ఏది కావాలంటే దానికి రావచ్చు. వారం, పక్షం, నెల... ఏదైనా సరే".

"వారంరోజులైతే పోతుందా?"

"ఊ... వారం వచ్చి మామూలు అయిన వాళ్లు ఉన్నారు. మీ పేరు, అడ్రసు ఇవ్వండి" వ్రాసుకున్నాడు.

"ఎప్పటి నుండి వస్తారు?"

"అదే... డబ్బు చూస్కుని వస్తాను"

"ఓ.కె." అనేసి అతను లోపలికి వెళ్లిపోయాడు.

సుబ్బారావ్ కుర్చీలోంచి నీరసంగా, బరువుగా లేచి నెమ్మదిగా అడుగులేస్తూ బయటకు వచ్చాడు. రెండువేల ఐదువందలు... వారం రోజులకి... అంత డబ్బు ఎలా వస్తుంది? నెల ఐతే పది వేలు. అమ్మో! నెల రోజులైతే తను వెళ్లే సమస్యే లేదు. అంత డబ్బు ఇన్ని ఏళ్లలో ఒక్కసారో, రెండుసార్లో చూసి వుంటాడు. నాన్న ప్రయివేట్ స్కూల్ టీచర్. జీతం మూడువేలు. నెలకు. ఆరు నెలలకూ వస్తూంటుంది. నాన్న స్కూలు నుంచి జీతం కట్టలుగా తేవడం, వాటిని పంపకాలు వేసేసి, ఆ మర్నాడు ఇచ్చేయడం జరుగుతూంటుంది. అంత డబ్బు వచ్చిన రెండు రోజులకే ఇంట్లో పది రూపాయలూ వుండవు. పాలు, సరుకులు, బియ్యం, బట్టలు, మందులు... అన్నీ అప్పే. జీతం రాగానే అవన్నీ తీర్చెయ్యాలి. అంత డబ్బు ఇంట్లో ఆరు నెలలకు సరిపోయేది.

ఇప్పుడు అంత డబ్బు వుంటే తనను నరక బాధపెడుతున్న ఈ మానసిక సమస్య నుంచి బయటపడి అందరిలా మామూలుగా బ్రతకవచ్చు.

దారిలో కూరలు కొనితెచ్చి అమ్మకి ఇచ్చాడు. "బీరకాయలు తెచ్చావు... ముదురువేమీ కాదు కదా? చూశావా? వాడిచ్చినవి పట్టుకొచ్చావా?

"చూసాను బావున్నాయి" అంటూ తన పుస్తకాల పెట్టె ముందు కూర్చున్నాడు. పెట్టెలో నుండి పుస్తకాలు బయటకు తీసి క్రింద పెడు

తుంటే తల్లి అరుపులు వినబడ్డాయి.

"ఒరేయ్... రెక్కలు ముక్కలయ్యేట్టు ఇప్పుడే ఆ గదంతా కడిగి శుభ్రం చేశాను. మళ్లీ అవన్నీ క్రింద పెడ్తున్నావా?

"తుడిచేస్తాలేవే"

"ఏమిటి తుడిచేది? ఫో... బయటపెట్టు ఆ దుకాణం".

పెట్టెని బయటకు తెచ్చి అరుగుమీద పెట్టాడు. పెట్టెలో నుంచి పుస్తకాలు తీసి బయట పెట్టి, పెట్టె అడుగునవున్న చిల్లర తీసి లెక్క పెట్టాడు తొంభై ఆరు రూపాయలున్నాయ్. అవన్నీ అమ్మ అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బులు, ఏవైనా కొన్నప్పుడు మిగిలిన చిల్లరా. "అంటే ఇంకా రెండువేల నాలుగు వందలు కావాలి". పెట్టె మళ్లీ సర్దేసి లోపలకి తీస్కొచ్చి దాని స్థానంలో పెట్టేసాడు.


కుర్చీలో కూర్చుని ఆలోచించడం మొదలు పెట్టాడు. ఎలా వస్తాయి అన్ని డబ్బులు...? ఆ డబ్బులుంటేనే తన సమస్యకు పరిష్కారం. సిగ్గు పోయి అందరిలా మామూలుగా బ్రతకడం. ఇంతకాలం అనుభవించిన దుఖాన్ని వదిలించుకోవాలంటే ఆడబ్బులు ఎలాగోలా సంపాదించక తప్పదు... కానీ ఎలా...? అమ్మనో, నాన్ననో అడిగితే...? ముందసలు ఈ విషయం ఎలా చెప్పాలో తెలియదు... ఒకవేళ చెప్పగల్గినా అమ్మ పట్టించుకోదు. పైగా తిడుతుంది. నాన్న అసలు విననే వినరు.

నాలుగు రోజులు దాని గురించి బుర్ర వేడెక్కేలా ఆలోచించాడు. కానీ ఏమీ తట్టడం లేదు. గోడమీద ప్రకటన సుబ్బారావ్‌ని నిలబడనీయడం లేదు. రాత్రిళ్లు నిద్ర పట్టనివ్వటం లేదు. తను మామూలుగా ప్రవర్తిస్తున్నట్లు, అందరితోనూ నవ్వుతూ కబుర్లు చెప్తున్నట్లు, అందరూ తనను అభినందిస్తున్నట్లు... ఒకటే ఊహలు. కలలు.

ఐదోరోజు సుబ్బారావ్‌కి మార్గం కనిపించింది. కానీ ప్రమాదకరమైనది. దొంగతనం... అవును... ఇంట్లోనే... అదీ అమ్మ గాజులు... అమ్మకి జత బంగారు గాజులున్నాయి. అవి ఏ పెళ్లికో లేదా తాతయ్య వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడో పెట్టుకుంటుంది. తనకు తెలిసి ఆ గాజులు అమ్మ చేతిన చూసి ఆరు నెలలైంది. ఇప్పట్లో దగ్గర బంధువుల ఇళ్లల్లో ఎవరి పెళ్లీ అయ్యే సూచనలు ఏమీ లేవు. పిన్ని పెళ్లి చేయడానికి ఇంకా నాలుగైదేళ్లు పడుతుందని, ఆ పెళ్లే త్వరలో జరిగే పెళ్లనీ అమ్మ, నాన్న అనుకుంటూండగా సుబ్బారావ్ విని వున్నాడు.

కాబట్టి ఆ గాజులు జాగ్రత్తగా తీసి తాకట్టు పెట్టి రెండువేల ఐదువందలు తీసుకోవాలి. అవి ఫీజు కట్టి తన్నింతకాలం బాధిస్తున్న ఈ సిగ్గు, బిడియాన్ని, భయాన్నీ వదిలించుకోవాలి. సిగ్గూ, బిడియం పోయాక అమ్మనాన్న ఏమైనా అన్నా సమాధానం చెప్పగలడు కదా! అప్పుడు అసలు భయం ఉండదు కదా!... ఈ ఏడాది డిగ్రీ ఐపోతుంది. వచ్చే ఏడాది ఏదో ఒక ఉద్యోగంలో చేరి నెలకి ఐదువందలు దాస్తే సరి. ఆ గాజులు విడిపించి తెచ్చి బీరువాలో పెట్టేయవచ్చు. అసలు తీసినట్లే తెలిసే అవకాశం లేదు. తెలిసినా అప్పటి వరకూ దాచిన డబ్బు చూపించి తను పడ్డ బాధను చెప్పి అమ్మను ఒప్పించవచ్చు. ఒప్పుకోక అమ్మ తిట్టినా బాధేముందీ? ఎలాగూ భయం ఉండదు కదా!... ఇలా సాగాయి సుబ్బారావ్ ఆలోచనలు. చివరికి గాజులు దొంగతనం చెయ్యాలని తీర్మానించుకున్నాడు.

ఆ అవకాశం మర్నాడే వచ్చింది. "ఒరేయ్ సుబ్బీ తమ్ముళ్లు దొడ్లో ఆడుకుంటున్నారు.




చూస్తుండు, నేను లక్ష్మిగారింటికి పేరంటానికి వెళ్లొస్తా. ఎక్కడికీ పోకు నేను వచ్చేవరకూ. వినపడిందా?... అని అమ్మ బయటకు వెళ్లింది.

సుబ్బారావు గబగబా వీధి తలుపు గడియ వేసి వచ్చి బీరువా తీసాడు. లోపల చీరల క్రింద పెట్టిన చిన్న పెట్టెలో నుంచి బంగారు గాజులు తీసాడు. మళ్లీ పెట్టె చీరల క్రింద పెట్టేసి, చీరలు సర్ది బీరువా మూసేసాడు.

ఇదివరకొకసారి నాన్న ఈ గాజులు రెండిటికీ మూడువేలు తెచ్చారు. కాబట్టి ఈ సారి రెండువేల ఐదువందలు తేవడం కష్టం కాదు. గాజులు రెండూ చిన్న పేపర్‌లో చుట్టి ప్యాంట్ జేబులో పెట్టుకుని వీధితలుపు తీసి చూసాడు. అమ్మ ఇంకా రావడం లేదు.

వచ్చి కుర్చీలో కూర్చుని మళ్లీ ఆలోచనలో పడ్డాడు. 'మార్వాడీ దగ్గరకు వెళ్లి గాజులు పెట్టి రెండువేల ఐదువందలు తీసుకొని తిన్నగా వెళ్లి ఫీజు కట్టి ఈ రోజు నుండే ట్రైనింగ్‌లో జాయిన్ అయిపోతాడు. వారం... వారం రోజుల్లో జీవితం మారిపోతుంది. ఈ సిగ్గూ, బిడియం, మొహమాటం, మనుషుల్ని చూసి పారిపోవడం, దాక్కోవడం ఇవన్నీ పటాపంచలైపోతాయి... అందరితో కలిసే వుంటాడు. కలిసి తిరుగుతాడు, కలిసి ఆడుకుంటాడు. ఆహా... గుండె నిండా ఎంత హాయి.. మనసులో తేనె పోసినట్లు ఎంత తియ్యగా వుంది... "తలుపు తీసి కూర్చున్నావేరా? ఏ పిల్లో వచ్చి పాలు తాగిపోతే రాత్రికి మజ్జిగుండదు..."

అమ్మ మాట్లాడితే తిట్టినట్లు వుంటుంది సుబ్బారావుకి. "అమ్మా బయటికి వెళ్లస్తా" అంటూ కంగారుగా వీధిలోకి జారుకున్నాడు.

మార్వాడీ దగ్గర డబ్బులు తీసుకుని ఇన్‌స్టిట్యూట్‌లో కట్టేసాడు. ఆ రోజే సుబ్బారావు శిక్షణ కూడా మొదలైంది. ట్రైనింగ్ ఇవ్వబోయే వ్యక్తి తన పేరు విక్రమ్‌కుమార్‌గా పరిచయం చేసుకున్నాడు. అతను చెప్పినట్లు ఒక నోటు పుస్తకం సందుచివర కొని తెచ్చాడు. ఆ పుస్తకంలో

సుబ్బారావు ఎదుర్కొంటున్న సమస్యలు రాయమన్నాడు విక్రమ్‌కుమార్. వరుసగా పది పాయింట్లుగా తనని బాధిస్తున్న సమస్యలను వ్రాసాడు సుబ్బారావ్.


"ఇవన్నీ ఇక మిమ్మల్ని వదిలేస్తాయి. మీరు మామూలుగా అయిపోతారు" అంటూ లోపలకి తీసుకెళ్లి ఓ గదిలో చాపమీద పడుకోబెట్టాడు. ఆ గదిలో బెడ్‌లైట్ మాత్రమే వుంది. కిటికీలన్నీ మూసివేసి వున్నాయి. "కళ్లు మూసుకోండి. ఇప్పుడు మీకు వినబడే మాటలు శ్రద్ధగా వినండి. ఇంకేం ఆలోచించవద్దు. ఓకే!"

టేప్ రికార్డర్ ఆన్ చేసిన శబ్దం. క్యాసెట్ లోంచి నెమ్మదిగా మాటలు వినబడుతున్నాయి. అవన్నీ శ్రద్ధగా ఆలకిస్తున్నాడు సుబ్బారావు. సిగ్గు, బిడియం, మొహమాటం, మెతకతనం ఎలా వస్తాయో, అవి ఎంత ప్రమాదమో మొదలైన వివరాలున్నాయి.


ఆ కేసెట్ అయిపోయాక బయటకు వచ్చేయమన్నాడు. "మరలా రేపు ఇదే టైమ్‌కి రండి".

మొదటి రోజు మార్పు ఏమైనా వచ్చిందా అని ఆలోచించడం మొదలు పెట్టాడు సుబ్బారావ్. కానీ వెంటనే ఒక్క రోజుకు ఏం వస్తుంది? ఇంకో రెండు రోజులు గడిస్తే తెలుస్తుంది అని సమాధానపడ్డాడు.

ఆ రెండో రోజు, మూడో రోజూ గడిచాయి. రోజుకి ఒక కేసెట్టు వినిపిస్తున్నాడు. అది అయ్యాక కూర్చోబెట్టి "మీకున్న సమస్యలన్నీ వదిలేసి హాయిగా వుండండి. మామూ



చిలకలూరిపేటలో జరిగిన 'స్మైలీ' కవితాసంపుటి ఆవిష్కరణ సభలో రాష్ట్ర అరసం కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, గ్రంథ ఆవిష్కర్త, పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు ఎస్. వెంకటేశ్వరశర్మ మరియు గ్రంథకర్త తోటకూర వేంకటనారాయణ.




ుగా వుండండి. అందరితో మాట్లాడండి..." అంటూ చెప్తున్నాడు.

నాలుగు, ఐదు రోజులు గడిచాక ఇంకా రెండు రోజులే వుంది అనుకున్నాక సుబ్బారావుకి పెద్దగా సంతృప్తి అనిపించలేదు. కానీ ఆ విషయం చెప్పలేకపోయాడు. ఆరు, ఏడు రోజులు గడిచి ట్రైనింగ్ పూర్తి అయింది. చివరి రోజున ఏదో పోగొట్టుకున్న వాడిలా అయ్యాడు సుబ్బారావు. వారం ముందు తనెలా వున్నాడో ఇప్పుడూ అలానే ఉన్నాడు. ఈ వారం రోజుల్లో చాలామందితో మాట్లాడాలని ప్రయత్నించాడు. సాధ్యంకాలేదు. మార్పు రాలేదని, వస్తుందనీ ఎదురుచూసాడు. కానీ ట్రైనింగ్ పూర్తయ్యాకా అదే పరిస్థితి వుండటం అతనికి బావురుమనిపించింది. అదే విషయం విక్రమ్‌కుమార్‌తో చెప్పాడు.

"ఈ వారంరోజులూ క్యాసెట్ల ద్వారా, నా ద్వారా మీకు చాలా విషయాలు తెలిసాయి. ఇక మీరు రోజూ వాటిని ప్రాక్టీస్ చేస్తూ వుండాలి. మీ ప్రాక్టీసు బావుంటే మీరు అనుకున్న మార్పు త్వరలో వస్తుంది" అనేసి వీలయినప్పుడు కనిపించమని చెప్పాడు విక్రమ్‌కుమార్.

సుబ్బారావ్ కాళ్లీడ్చుకుంటూ బయటకు వచ్చాడు. అతను చెప్పినట్లుగానే ప్రయత్నించి చూసాడు. నెల రోజులు గడిచాకా పూర్వ స్థితిలోనే వున్నాననుకొని మళ్లీ ఇన్‌స్టిట్యూట్ దగ్గరికొచ్చాడు.

"వారం రోజుల శిక్షణ మీకు సరిపోలేదనుకుంటాను. పదిహేను లేదా నెల రోజుల కోర్సులో చేరండి... మీ సమస్య చాలా డీప్‌గా వున్నట్లుంది... ఒక్కొక్కరికి వారం సరిపోతుంది... ఆలోచించుకుని మళ్లీ చేరండి..."

సుబ్బారావ్‌కి ఇది వరకున్న బెంగలకి తోడు ఇప్పుడు కొత్తగా తీవ్రమైన ఆందోళన, ఉద్రిక్తత వచ్చి చేరాయి. ఇంట్లో బీరువా చప్పుడైనా అమ్మ దేనికైనా అరిచినా గుండెల్లో సూపర్‌ఫాస్ట్ రైళ్లు దడదడా పరిగెడుతున్నాయ్. ●